## శివ భక్తుల జ్యోతిర్లింగ సందర్శన యాత్ర



ఇరుముడితో యాత్రకు వెళుతున్న శివ భక్తులు

అశ్వారావుపేట టౌన్, డిసెంబర్ 15: గుజరాత్ రాష్ట్రంలోని నాగేశ్వరం జ్యోతిర్లింగ సందర్శన యాత్రకు పట్టణంలోని 50 మంది శివ భక్తులు శుక్రవారం పయనమయ్యారు. వీరు ముందుగా, వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో గురుస్వామి జల్లిపల్లి శ్రీరామ్మూర్తి సారథ్యంలో ఇరుముడి ధరించారు. ఈ భక్తుల యాత్ర తొమ్మిది రోజులపాటు కొనసాగుతుందని గురుస్వామి తెలిపారు.

## మొక్కల పెంపకం త్వరగా చేపట్టాలి



నర్సరీని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి అనసూయ

అన్నపురెడ్డిపల్లి, డిసెంబర్ 15: నర్సరీల్లో మొక్కల పెంపకం త్వరగా చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి అనసూయ ఆదేశించారు. మండలంలోని వివిధ గ్రామాల్లోగల నర్సరీలను శుక్రవారం పరిశీలించారు. మొక్కల పెంపకం వివరాలను ఎంపీడీవో అన్నపూర్ణ నుంచి తెలుసుకున్నారు. మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.

## ఆటో డ్రైవర్ల వినతి



వినతిపత్రం ఇస్తున్న ఆటో డ్రైవర్లు

అన్నపురెడ్డిపల్లి, డిసెంబర్ 15: ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో ఉపాధి దెబ్బతింటున్న తమను ఆదుకోవాలని కోరుతూ ఆటో డ్రైవర్లు శుక్రవారం తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. తమకు జీవన భృతి ఇవ్వాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.

## ఎంపీపీపై అవిశ్వాస తీర్మానానికి వినతి



ఆర్‌డీవోకు వినతిపత్రం ఇస్తున్న ఎంపీటీసీ సభ్యులు

టేకులపల్లి, డిసెంబర్ 15: టేకులపల్లి ఎంపీపీ భూక్యా రాధపై అవిశ్వాస తీర్మానాన్ని కోరుతూ 11 మంది ఎంపీటీసీ సభ్యులు శుక్రవారం కొత్తగూడెం ఆర్‌డీవో శిరీషకు వినతిపత్రం ఇచ్చారు. మండలంలో మొత్తం 14 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. వినతిపత్రం ఇచ్చిన 11 మందిలో బానోత్ మౌనిక(తడికలపూడి), చింత శాంతకుమారి(కొప్పురాయి), బానోత్ పూర్ణ(బేతంపూడి), ఊకే రామకృష్ణ(బద్దుతండా), బానోత్ సరోజిని(ప్రెగళ్లపాడు), జాల సంధ్య(కోయగూడెం), ఉండేటి ప్రసాద్(సులానగర్), వాంకుడోత్ ధనలక్ష్మి(గొల్లపల్లి), భూక్యా శంకర్(బిల్లుడు తండా), పూన్నెం స్వప్న(కిష్టారం), బట్టు శైలజ(గంగారం) ఉన్నారు. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు మండల పరిషత్ సమావేశాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని కోరుతూ ఎంపీడీవో కె.వీరబాబుకు వినతిపత్రం ఇచ్చారు. వైస్ ఎంపీపీ ఉండేటి ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## తుపాన్ బాధిత రైతులను ఆదుకోవాలి

టేకులపల్లి, డిసెంబర్ 15: తుపాన్ బాధిత రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. నాయకులు చింత శ్రీరాములు, సమ్మయ్య, లక్ష్మి, పొట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి






మాట్లాడుతున్న జిల్లా జడ్జి పాటిల్ వసంత్, పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయాధికారులు, న్యాయవాదులు

కొత్తగూడెం టౌన్, డిసెంబర్ 15 : జిల్లా కోర్టులో ఈ నెల 30వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా జడ్జి పాటిల్ వసంత్ అన్నారు. శుక్రవారం కోర్టు కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు తమ కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కాంపౌండ్, ఈ పీటీ కేసులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా న్యాయమూర్తులు భానుమతి, బత్తుల రామారావు, సుచరిత, డీఎస్పీ రెహమాన్, పీపీలు పోసాని రాధాకృష్ణమూర్తి, విజయకుమార్, వెలగల నాగిరెడ్డి, ఏపీపీలు లావణ్య, విశ్వశాంతి, బార్ అధ్యక్షుడు రమేశ్‌కుమార్ మక్కడ్ పాల్గొన్నారు.

# సీపీఎస్ రద్దుకు చొరవ చూపాలి

టేకులపల్లి, డిసెంబర్ 15: సీపీఎస్ రద్దుకు నూతన ప్రభుత్వం చొరవ చూపాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి. రాజు విజ్ఞప్తి చేశారు. టీఎస్ యూటీఎఫ్ మండల పదవ మహాసభ శుక్రవారం స్థానిక ఎంపీపీఎస్ సెంటర్‌లో మండల అధ్యక్షురాలు మంగతాయి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథి రాజు మాట్లాడుతూ.. నూతన ప్రభుత్వానికి టీఎస్ యూటీఎఫ్ తరపున సంపూర్ణ మద్దతు, సహకారం ఉంటుందని అన్నారు. సీపీఎస్ రద్దుకు చర్యలు తీసుకోవాలని, విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని, ఉపాధ్యాయుల బదిలీలు–ఉద్యోగోన్నతులకు చర్యలు తీసుకోవాలని, టెట్ మినహాయింపునకు సంబంధించి ప్రత్యేక పరీక్షలు నిర్వహించాలని, వేతనాలను ఒకటో తేదీన చెల్లించాలని, ఉపాధ్యాయులు–విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లా అధ్యక్షుడు భూక్యా కిషోర్‌సింగ్, ప్రధాన కార్యదర్శి నందికృష్ణ, ఉపాధ్యక్షురాలు వరలక్ష్మి, మండల ప్రధాన కార్యదర్శి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజు

## పొట్టి శ్రీరాములుకు నివాళి



అన్నపురెడ్డిపల్లిలో నివాళి

అశ్వారావుపేట, డిసెంబర్ 15: తన ప్రాణ త్యాగంతో ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ప్రాణం పోసిన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయనకు ఆర్య వైశ్య సంఘం నాయకులు నివాళులర్పించారు. విగ్రహానికి పూలమాలలు వేశారు. సంఘం మండల అధ్యక్షుడు కొణిజర్ల ఉమామహేశ్వరరావు, జల్లిపల్లి దేవరాజు, భోగవల్లి రాంబాబు, శీమకుర్తి సుబ్బారావు, సత్యవరపు సంపూర్ణ, గుడివాడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అశ్వారావుపేట: నివాళులర్పిస్తున్న ఆర్య వైశ్య నాయకులు

అన్నపురెడ్డిపల్లి, డిసెంబర్ 15: అన్నపురెడ్డిపల్లిలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్య వైశ్య సంఘం నాయకులు శుక్రవారం పూలమాల వేసి నివాళి అర్పించారు. సర్పంచ్ పద్మ, నాయకులు వనమా గాంధీ, పర్సా వెంకటేశ్వరరావు, భీముడు, నరసింహ, శ్రీనివాసరావు, ప్రవీణ్, పుల్లారావు పాల్గొన్నారు.



## ఆర్చరీ క్రీడాకారుడికి సత్కారం

ములకలపల్లి, డిసెంబర్ 15: జాతీయ స్థాయి ఆర్చరీ పోటీకి ఎంపికైన మండలంలోని పాత గంగారం గ్రామానికి చెందిన విద్యార్థి ఇర్పా ప్రతాప్‌ను సర్పంచ్ వాడే లక్ష్మి శుక్రవారం శాలువాతో సత్కరించారు. పంచాయతీ కార్యదర్శి సునేష్, ఉపాధ్యాయురాలు నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు సునీత, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఇర్పా ప్రతాప్‌ను సత్కరిస్తున్న సర్పంచ్

## యోగాతో ఏకాగ్రత

దమ్మపేట రూరల్, డిసెంబర్ 15: విద్యార్థులు యోగా సాధన చేస్తే.. చదువుపై ఏకాగ్రత ఏర్పడుతుందని దమ్మపేటలోని గాయత్రి ఆశ్రమ వ్యవస్థాపకుడు, యోగా గురువు ప్రేమ్ సుస్థిర మూర్తీజీ అన్నారు. మండలంలోని మల్కారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ఆయన యోగాపై, వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. సామాజిక బాధ్యత, మానవత్వం, పర్యావరణ పరిరక్షణ వంటివన్నీ వ్యక్తిత్వ వికాసంలో భాగమేనని అన్నారు.



మాట్లాడుతున్న ప్రేమ్ సుస్థిర మూర్తీజీ



పనులను పరిశీలిస్తున్న దమ్మాలపాటి

## నిర్మాణ పనుల పరిశీలన

ఇల్లెందు, డిసెంబర్ 15: స్థానిక 22వ వార్డులో అంబేద్కర్ భవన్, మిషన్ భగీరథ ట్యాంక్ నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. పనులు నత్తనడకన సాగుతున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. త్వరగా పూర్తిచేయాలన్నారు. కౌన్సిలర్లు అంకెపాక నవీన్, వారా రవి, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరసింహారావు, సూపర్‌వైజర్ మని రాజు పాల్గొన్నారు.

## పోక్సో కేసు నిందితుడి అనుమానాస్పద మృతి

అన్నపురెడ్డిపల్లి, డిసెంబర్ 15: పోక్సో కేసులో నిందితుడైన యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాలు.. మండలంలోని అబ్బుగూడెం గ్రామానికి చెందిన బలగాని సందీప్(20) దినసరి కూలీ. ఓ బాలికతో ప్రేమ వ్యవహారంలో అతడిపై గత ఏడాది ఫిబ్రవరిలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. ఇది కోర్టు విచారణలో ఉంది. శుక్రవారం కోర్టులో కేసు వాయిదా ఉంది. అతడి కుటుంబీకులు గురువారం రాత్రి ఇంటి ఆరుబయట నిద్రించారు. సందీప్ లోపల పడుకున్నాడు. తెల్లారేసరికి రేకుల ఇంటి కప్పుకు తాడుకు వేలాడుతూ మృతదేహం కనిపించింది. అతడి రెండు చేతులూ తాడుతో గట్టిగా కట్టేసి ఉన్నాయి. సెల్‌ఫోన్ మెసేజ్‌లో.. 'కేసులో 20 ఏండ్లు శిక్ష పడుతుంది. దానికంటే చనిపోవడం కరెక్ట్' అని ఉంది. సందీప్ సోదరుడు వెంకన్న ఫిర్యాదుతో కేసును ఏఎస్సై అంజయ్య దర్యాప్తు చేస్తున్నారు. సందీప్ రెండు చేతులు తాడుతో కట్టి ఉండటంతో మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## మంత్రి పొంగులేటిని కలిసిన నాయకులు



మంత్రి పొంగులేటితో కాంగ్రెస్ నాయకులు

చంద్రుగొండ, డిసెంబర్ 15: రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మండలంలోని తిప్పనపల్లి పంచాయతీకి చెందిన కాంగ్రెస్ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో ధరావత్ రామారావు, పసుపులేటి మంగయ్య, సయ్యద్ షఫీ, మచ్చా కుమార్, సయ్యద్ సైదా ఉన్నారు.

## ధాన్యం కొనుగోలుకు సిద్ధం

చుంచుపల్లి, డిసెంబర్ 15: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని సొసైటీ చైర్మన్ మండె వీరహన్మంతరావు తెలిపారు. శుక్రవారం చుంచుపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సొసైటీ పరిధిలో మొత్తం 12 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకొని ఏఈవో వద్ద టోకెన్లు తీసుకున్న తర్వాత మాత్రమే కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకురావాలని సూచించారు. సమావేశంలో సొసైటీ డైరెక్టర్లు బండి అమృతరావు, గుగులోత్ చందర్, తీట్ల విజయకుమారి, పోటు వెంకటేశ్వరరావు, గుగులోత్ విజయ, కంటెం సత్యనారాయణ, పండ్ల సారయ్య పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికులకు వైద్య పరీక్షలు

కొత్తగూడెం అర్బన్, డిసెంబర్ 15 : భవన నిర్మాణరంగంలో పనిచేస్తున్న కార్మికులకు హెల్త్ కేర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని హనుమాన్‌బస్తీ అంగన్‌వాడీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 25వ వార్డు కౌన్సిలర్ ఎండీ సాహెరాబేగం పాల్గొన్నారు. సీఎస్‌సీ హెల్త్ కేర్ ట్రస్టు జిల్లా కో–ఆర్డినేటర్ అక్బర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శారద, టీచర్లు రాజకుమారి, పద్మ, శైలజ తదితరులు పాల్గొన్నారు.